


శ్రీమహాసరస్వతీ దేవిగా చందోలు బండ్లమ్మ



మార్టూరులో సరస్వతిదేవిగా..



నడింపల్లి శ్రీరెడ్డంకమ్మ అమ్మవారి అలంకరణ

వాగ్దేవి.. విజ్ఞానప్రదాయిని



భట్టిప్రోలులో సామూహిక పూజలో విద్యార్థులు

దసరా ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. నవరాత్రుల్లో అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తోంది. మూలా నక్షత్రం పురస్కరించుకుని బుధవారం సరస్వతీమాతగా అలంకరించారు. చిన్నారులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

- న్యూస్‌టుడే, మార్టూరు, పిట్టలవానిపాలెం, చెరుకుపల్లి(గ్రామీణ), భట్టిప్రోలు

రేపల్లె ఆర్డీవో బాధ్యతల స్వీకరణ



రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారిగా **ఎన్. రామలక్ష్మి** బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. తహసీల్దార్లు శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, పద్మావతి, షకీర్ పాషా, నెహ్రూబాబు తదితరులు ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన హెలాషారోన్ కృష్ణా జిల్లా ఉయ్యూరు బదిలీపై వెళ్లారు.

ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటెన్నడు!

న్యూస్‌టుడే, బాపట్ల



రెండున్నర ఏళ్లుగా ప్రతిపాదన దశలోనే

రహదారి ప్రమాద బాధితులకు అందని సత్వర వైద్యం

16వ నంబరు జాతీయ రహదారి

జిల్లాలో జాతీయ రహదారులపై సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందక ఏటా వందల మంది మృత్యువాత పడుతున్నారు. వైద్యం కోసం విజయవాడ, గుంటూరు, ఒంగోలుకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఈ క్రమంలో మార్గమధ్యలోనే విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి తక్షణ వైద్యం అందించి ప్రాణాలు కాపాడటానికి ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి రెండున్నరేళ్లుగా ప్రతిపాదనలు పంపిస్తున్నా కార్యరూపం దాల్చటం లేదు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రత్యేక చొరవ చూపి మంజూరు చేయించాల్సి ఉంది.

☛ జిల్లాలో 16వ నంబరు జాతీయ రహదారి, 216 ఏ జాతీయ రహదారి ఉన్నాయి. ఓడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 80 శాతం రోడ్డు ప్రమాదాలు జాతీయ రహదారులపైనే జరుగుతున్నాయి. ఎన్‌హెచ్-16లో మేదరమెట్ల నుంచి మార్టూరు వరకు, ఎన్‌హెచ్-216ఏలో ఈపూరుపాలెం నుంచి చినగంజాం వరకు, పెనుమూడి-పులిగడ్డ వారధి సమీపంలో ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. క్షతగాత్రులకు జిల్లాలో ఎక్కడా అత్యవసర వైద్యం అందించే ఆసుపత్రి లేదు. అంబులెన్స్‌ల్లో హుటాహుటిన 60 కి.మీ దూరంలోని విజయవాడ, గుంటూరు, ఒంగోలు తరలించాల్సి వస్తోంది. సకాలంలో వైద్యం అందక క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారు.



రహదారిపై పడిపోయిన క్షతగాత్రులు



ఎన్‌హెచ్-16లో లారీ ప్రమాదం

జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో మృతులు, క్షతగాత్రుల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	567	235	671
2024 (ఇప్పటి వరకు)	391	162	438

☛ రహదారుల భద్రతా కమిటీ సమావేశాల్లో బాపట్లను జిల్లా ఆసుపత్రిగా మార్చాలని, అద్దంకిలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించారు. రేపల్లె సామాజిక ఆసుపత్రిని ప్రాంతీయ ఆసుపత్రి స్థాయికి పెంచాలన్న ప్రతిపాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. చీరాల ప్రాంతీయ ఆసుపత్రిలో ఎముకల వైద్య నిపుణుడు లేకపోవటంతో క్షతగాత్రులకు సరైన వైద్యం అందటం లేదు. ట్రామాకేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందించటానికి వైద్యులు, పరికరాలు అందుబాటులో ఉంటారు.

కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించటానికి జిల్లాకు ట్రామాకేర్ కేంద్రం మంజూరు చేయాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి కోరతా. త్వరలో కేంద్రం వచ్చేలా కృషి చేస్తా. 216 ఏ జాతీయ రహదారిలో డ్రైవర్లకు విశ్రాంతి కేంద్రాలు నిర్మించాల్సిన అవసరాన్ని మంత్రికి వివరిస్తా.

- తెన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల ఎంపీ

ప్రతిపాదనలు పంపించాం

జిల్లాలో రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులకు సత్వర వైద్య సేవలు అందించటానికి ట్రామాకేర్ కేంద్రం మంజూరు చేయాలని రహదారి భద్రతా కమిటీ సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాం. దీని ఆవశ్యకతను ఎన్‌హెచ్ అధికారులకు వివరించాం.

- విజయమ్మ, డీఎంహెచ్‌వో

రేవుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి: కలెక్టర్

బాపట్ల, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానంలో జిల్లాలో కొల్లూరు మండలంలోని గాజుల్లంక, జువ్వలపాలెం రేవుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసినట్లు కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. కలెక్టరేట్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో రేవు వద్ద 74 వేల మెట్రిక్ టన్నులకు పైగా ఇసుక లభ్యత ఉన్నట్లు పేర్కొన్నారు. జీవోఎంఎస్ నంబరు 40 ఆధారంగా రేవుల నుంచి ఇసుక తవ్వడానికి ఏజెన్సీలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఏజెన్సీ ఎంపిక ప్రక్రియ టెండర్ దశలో ఉందన్నారు. ఇసుక రేవుల వద్ద అక్రమ తవ్వకాలను నియంత్రించాలని ఆదేశించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టటానికి ఇద్దరు ఉప తహసీల్దారులు, ముగ్గురు ఆర్ఐలు, పోలీసులను కలిపి కమిటీగా నియమించామన్నారు. నిరంతర నిఘా, పర్యవేక్షణ ఉంటుందన్నారు. రేవుల వద్ద 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. తొమ్మిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. ఇసుక కొనుగోలుపై రూపొందించిన ప్రత్యేక యాప్‌పై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. జేసీ ప్రఖర్‌జైన్, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, గనుల శాఖ ఏడీ రాజేష్, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రూ.89.56 కోట్లతో పనులు

జిల్లాలోని పంచాయతీల్లో రూ.89.56 కోట్లతో 800 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. తన క్యాంపు కార్యాలయం నుంచి పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలపై జిల్లా అధికారులతో వీక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పల్లెల్లో ప్రగతి పనులను పండగ వాతావరణంలో ప్రారంభించాలన్నారు. ప్రజా సమాచార బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలని, గ్రౌండింగ్ చేసిన పనులన్నీ జియోట్యాగ్ చేయాలని చెప్పారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. డీపీవో ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, పీఆర్ ఎస్ఈ హరే రామకృష్ణ, డీఎల్‌డీవో సువార్త పాల్గొన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

దశాబ్దాలుగా ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగం



బల్లికురవలో నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం

బల్లికురవ ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా ఉంటుంది. రాత్రయితే ఇక్కడ మందుబాబుల ఆగడాలు అధికమవుతున్నాయి. సంచారజాతుల వారికి ఆవాసంగా మారింది. దాతల సహకారంతో ఎకరం విస్తీర్ణంలో 1987లో దీనిని నిర్మించి ప్రారంభించారు. చిలకలూరిపేట, నరసరావుపేట, అద్దంకి డిపోలకు చెందిన సర్వీసులు బస్టాండులోకి వచ్చి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుండేవి. కాలక్రమంలో లోపలకు రావటం లేదు. ప్రయాణికులు కూడా బల్లికురవ నాలుగు రోడ్ల కూడళ్ల వద్దే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. దశాబ్దాలుగా నిరుపయోగంగా మారింది.

-న్యూస్‌టుడే, బల్లికురవ(అద్దంకి)





ఉక్కపోత తట్టుకోలేని రోగులకు బంధువుల సపర్యలు

ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి

జీజీహెచ్‌లోని ఏఎంసీ అత్యవసర రోగుల అడ్వాన్స్‌డ్ ఐసీయూ విభాగాల్లో ఏసీలు, ఫ్యాన్‌లు పని చేయడం లేదు. ఓ పక్క ఉక్కపోత తట్టుకోలేకపోతుంటే.. మరోపక్క లోపల ఉన్నవారికి గాలి తగలక అల్లాడిపోతున్నారు. ఏఎంసీలో అయితే అసలేమీ పని చేయడం లేదు. అడ్వాన్స్‌డ్ ఐసీయూలో కొన్ని మూలనపడ్డాయి. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి. ఈ విభాగాల్లో కిటికీలన్నీ మూసేసే ఉంటాయి. శీతల యంత్రాలు కాసేపు పని చేయకపోతేనే ఉండలేము. అలాంటిది రోజుల తరబడి రోగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వారి బంధువులే విసనకర్రలతో సపర్యలు చేయాల్సి వస్తోంది. జీజీహెచ్ అధికారులు వెంటనే స్పందించి ఏసీలు, ఫ్యాన్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు. **- ఈనాడు - గుంటూరు**



ఏఎంసీలో పనిచేయని ఏసీలు

భారీ వాహనమండి.. మొరాయించిందండి..



కొరిశపాడు మండలం తిమ్మనపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై 90 టైర్ల భారీ వాహనం ఇంజిన్ మరమ్మతులకు గురవడంతో రెండు రోజుల నుంచి నిలిచిపోయింది. భారీ యంత్రాలను చెన్నై నుంచి హైదరాబాద్‌లోని ఒక కర్మాగారానికి ఈ లారీ తీసుకువెళ్తుంది. గురువారం మరమ్మతులు పూర్తయితే హైదరాబాద్‌కు బయలుదేరతామని సిబ్బంది తెలిపారు. **- న్యూస్‌టుడే, మేదరమెట్ల**

మద్యం దుకాణాలకు 1250 దరఖాస్తులు

బాపట్ల: జిల్లాలో మద్యం దుకాణాలకు బుధవారం సాయంత్రానికి 1250 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి(డీపీఈవో) జి.దేవదత్తు తెలిపారు. డీపీఈవో కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ బుధవారం ఒక్క రోజు 200 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల దాఖలుకు తుది గడువును ఈ నెల 11 వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. 14న లాటరీ తీసి ఎంపికైన వారికి మద్యం దుకాణం నిర్వహించటానికి రెండేళ్ల లైసెన్స్ జారీ చేస్తామన్నారు. ఇంకొల్లు, మార్టూరు మండలాల్లో మద్యం దుకాణాలు దక్కించుకోవటానికి వ్యాపారులు, అధికార పార్టీ నేతలు పోటీపడుతున్నారు. ఇంకొల్లు మండలంలో 115వ దుకాణానికి జిల్లాలో అత్యధికంగా 41 దరఖాస్తులు వచ్చాయి. ఇదే మండలంలో 113 దుకాణానికి 40 దరఖాస్తులు వేశారు. అద్దంకి పట్టణంలో 21 దుకాణానికి 15 దరఖాస్తులు అందాయి. చీరాల పట్టణంలో నేతలు, వ్యాపారులు రింగ్‌గా మారి సిండికేట్ కావటంతో నాలుగు దుకాణాలకు ఆరు చొప్పున మాత్రమే దరఖాస్తులు వేశారు.

ఖజానా కార్యాలయంలో విచారణ

ఈనాడు కథనానికి స్పందన

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల ఉప ఖజానా కార్యాలయంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై అధికారుల బృందం ఎట్టకేలకు విచారణ చేపట్టింది. ఈ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ఉన్నతాధికారుల ఆఫీసు ఆర్డర్‌ని లెక్కచేయకుండా ఉండడమే కాకుండా జీతాలు, పింఛన్లకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉంచడంపై 'ఈనాడు'లో వరుస కథనాలు వెలువడ్డాయి. దీనికి స్పందించిన కలెక్టరు ఆర్డీవోచేత విచారణ చేయించారు. ఆ నివేదిక ఆధారంగా ఉద్యోగులందర్నీ బదిలీ చేయాలని కలెక్టరు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్‌కి నివేదించారు. దీంతో ఎస్టీవోని డైరెక్టరేట్‌కి సరెండర్ చేశారు. మరొకరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు మిగిలిన వారిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఇంకా లోతైన విచారణకు ఆరోజున డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ ఆదేశించారు. దీనిలో భాగంగా గడిచిన రెండు రోజుల నుంచి అయిదుగురు సభ్యులతో కూడిన బృందం స్థానిక కార్యాలయంలో ఉంటూ అత్యంత గోప్యంగా విచారణ చేస్తోంది. పత్రికల్లో వచ్చిన కథనాలు, వివిధ లావాదేవీలకు సంబంధించిన రికార్డుల తనిఖీ జరుగుతోంది. ఈసమయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చూడడంతో పాటు వాటిని నమోదు చేసుకుంటున్నారు. తనిఖీల అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వారు పేర్కొన్నారు. విచారణలో విజయనగరం డీటీవో ఆర్ఏఎస్‌కుమార్, ఎస్టీవోలు రమేష్, సురేష్ కుమార్, తులసీరావు శ్రీకాకుళం ఎస్టీవో, కర్నూలు ఎస్టీవో అంజిత్‌పాషా, అహ్మద్ ఎస్టీవో ఎస్‌ఏ ఉన్నారు.



విచారణ చేస్తున్న అధికారులు

విపత్తులొచ్చినా.. విత్తు చల్లాలన్నా..

డ్రోనాస్త్రం

ఔషధాల తరలింపులోనూ వినియోగం

యువతకు శిక్షణ

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-కొల్లిపర



పొలాల్లో డ్రోన్‌తో పురుగుమందులు చల్లుతూ...

బుడమేరు వరదలో చిక్కుకున్న బాధితులకు ఆహారం, ఔషధాలు అందించడానికి...

వరదనీటి ప్రవాహం ఏ స్థాయిలో ఉందో గమనించడానికి.....

పొలాల్లో విత్తనాలు, పంటలకు రసాయనాలు చల్లడానికి..

పీహెచ్‌సీల నుంచి లంక గ్రామాలకు మందుల సరఫరాకు...

ఇలా ప్రతీ పనీ సులభంగా, వేగంగా పూర్తి కావడానికి డ్రోన్ల వినియోగం బాగా పెరిగింది. వీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి.

వరదలొచ్చినప్పుడు కృష్ణా నది లంక గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతుంటాయి. రాకపోకలుండవు. ఈ పరిస్థితుల్లో బాధితులకు అవసరమైన ఆహారం, మందులు అందించడానికి డ్రోన్లు బాగా ఉపయోగపడుతున్నాయి. పది కిలోల బరువును మోసుకెళ్తున్నాయి. అనుకున్న ప్రదేశానికి సులువుగా వెళ్లగలుగుతున్నాయి. బుడమేర వరద సమయంలో డ్రోన్లను ప్రభుత్వం బాగా వినియోగించింది. తీవ్రత ఎక్కువ ఉన్న ప్రాంతాల చిత్రాలను తీయడంతోపాటు, గండ్ల పూడ్చివేత పనుల పరిశీలనకు అవి అక్కరకొచ్చాయి.

భూముల సర్వేలోనూ.....

భూముల సర్వే, కొలతలకు, గట్లు, ఇతర అంశాలను గుర్తించేందుకు చిత్రాలు తీయడానికి ఇప్పటికే రెవెన్యూ, భూమి కొలతల విభాగాల్లో డ్రోన్లను బాగా వినియోగిస్తున్నారు. భూమి కొలతలు నిర్దిష్టంగా గుర్తించడంలో వీటి పాత్ర చాలా కీలకంగా ఉంది. వాగులు, వంకలు, చెరువులు, నదీ పరివాహక ప్రాంతాల్లో వీటి ద్వారా సేకరించిన చిత్రాలు భూపరిపాలనా విభాగానికి ఉపయోగపడుతున్నాయి.

వైద్యరంగంలోనూ...

వైద్యరంగంలోనూ డ్రోన్ల వినియోగానికి అడుగులు పడుతున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా కొల్లిపర మండలంలో చేపట్టిన ప్రయోగం ఫలవంతమైంది. మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని అన్నవరపులంకలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి ఔషధాల కిట్‌ను విజయవంతంగా పంపించారు. కేవలం పది నిమిషాల వ్యవధిలోనే డ్రోన్ చేరుకుంది.

సాగులోనూ...

కూలీల కొరతను అధిగమించేందుకు, సంక్లిష్టమైన పనులు చేసేందుకు, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించేందుకు డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. విత్తనాలు, పురుగుమందులు చల్లేందుకు వీటి వినియోగం బాగా పెరిగింది. తాజాగా చీడపీడల్ని గుర్తించేందుకు కూడా ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం సాంకేతిక విద్య అభ్యసించిన యువతతోపాటు, కొంత మంది రైతులు శిక్షణ తీసుకుంటున్నారు.



భూమి కొలతల్లో డ్రోన్ వినియోగం

☛ గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డ్రోన్ పైలట్ల కోసం ప్రత్యేక కోర్సు నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొల్లిపర మండలం మున్నంగి ప్రైవేటు సంస్థ యువతకు శిక్షణ ఇస్తోంది. ఈ రెండుచోట్లా 874 మందికి ధ్రువపత్రాలిచ్చారు. వీరిలో కొందరు ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తుండగా, మరికొందరు సొంతంగా డ్రోన్లు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతూ ఇతరులకూ అవకాశాలిస్తున్నారు. పొలాల్లో పురుగుమందులు చల్లుతూ ఎకరాకు రూ. 300 నుంచి రూ. 500 వరకు తీసుకుంటున్నారు.

☛ కేంద్రం మహిళా స్వయం సహాయక బృందాలకు డ్రోన్లు ఇవ్వాలని నిర్ణయించింది. సాగు ఖర్చు తగ్గించి, పంట దిగుబడి పెంచడమే లక్ష్యంగా కిసాన్ డ్రోన్ల పేరుతో బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.

☛ రాష్ట్ర ప్రభుత్వం కూడా డ్రోన్ కార్పొరేషన్ ద్వారా సేవలు విస్తృతం చేసేందుకు కసరత్తు చేస్తోంది.

☛ ప్రభుత్వం అనుమతిచ్చాక గ్రామీణ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తామని ఎన్జీరంగా వర్సిటీ డ్రోన్ పరిశోధకులు, సీనియర్ శాస్త్రవేత్త ఆచార్య ఎ. సాంబయ్య తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగింపు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి మండలం ధర్మవరం హత్యాయత్నం కేసులో నిందితులకు రిమాండ్ పొడిగించారు. గతనెల 13న తెదేపా నేతల నిమజ్జనం ఊరేగింపు సమయంలో జరిగిన ఘర్షణలో గ్రామానికి చెందిన వైకాపా శ్రేణులు కారం చల్లి, రాళ్లు, ఇనుపరాడ్‌లతో దాడి చేసిన సంగతి పాఠకులకు విదితమే. ఈ దాడిలో తెదేపా సానుభూతిపరుడు పి.లక్ష్మయ్య కన్ను పూర్తిగా కోల్పోయారు. ఆయనతో పాటు మరికొంతమందికి చేయి, వేలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దీనిలో నిందితులుగా పది మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు. ఒంగోలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారిని బుధవారం అద్దంకి కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి మరో 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ పి.కృష్ణయ్య తెలిపారు. నాటి నుంచి గ్రామంలో పోలీసులు పికెట్ కొనసాగిస్తున్నారు.

గంగపుత్రులు.. సాహసమే ఊపిరిగా సంద్రంలో వేటాడే శ్రమజీవులు.. రోజుల తరబడి కడలిపై జీవన పోరాటం చేస్తూ చిక్కిన చేపలతో బయటకొచ్చే మత్స్యకారులకు.. అదే జీవనాధారం.. మళ్లీ రేపటి సముద్ర యాత్రకు పెట్టుబడిమార్గం.. కానీ ఆ మీనమే చిక్కక. వల నిండక.. విలవిల్లాడుతున్నారు. ఫలితంగా అటు బోటు యజమానులు, ఇటు కలాశీలు ఇబ్బంది పడుతున్నారు. చేపలు ఎందుకు దొరకడంలేదనేది కారణాలు అన్వేషించాల్సి ఉంది.

వల నిండని వేట

న్యూస్‌టుడే, చీరాల గ్రామీణం

బాపట్ల జిల్లాలో వాడరేవు, నిజాంపట్నం, రామాపురంలో అధికంగా మర బోటులు, ఎంసీల్ బోటుల ద్వారా వేట సాగిస్తారు. గత జూన్ 14న వేట నిషేధం ముగిసి, తిరిగి ప్రారంభమయ్యాక వేటకు వెళ్లిన గంగపుత్రులకు ఇప్పటి వరకు సరైన సరకు లభించలేదు. జిల్లాలో మత్స్యకారులు ఉత్తరాన బందరు, దక్షిణాన చెన్నై వరకు తూర్పున 150 నుంచి 200 కి.మీ వరకు వేటకు వెళ్లి వస్తుంటారు. ఎనిమిది మంది కలాశీలతో పాటు లోపలకి వెళ్లే ఒక్కో బోటు వారం పాటు అవిశ్రాంతంగా వేట సాగించి, తిరిగి బయటకు వస్తుంది. ఈ ప్రక్రియ నాలుగు నెలలుగా సరిగ్గా జరగటం లేదు. దీంతో బోట్లను తీరానికే పరిమితం చేస్తున్నారు. కొందరు సముద్రంలో లంగరు వేసి ఉంచుతున్నారు.

వాడరేవులో రూ.కోటికిపై వ్యాపారం : ఒక్క వాడరేవు తీరంలోనే సాధారణంగా రోజుకు రూ.కోటి విలువైన చేపల వ్యాపారం జరుగుతోంది. స్థానికులు, వివిధ ప్రాంతాల వ్యాపారులు ఇక్కడ జరిగే వేలంలో చేపలు కొని, రొయ్యలు, చేపలు, ఎండు చేపలు చెన్నై, బెంగళూరు, కేరళ, హైదరాబాద్, ఒడిశా, దిల్లీ, ముంబయి, పుణె వంటి నగరాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం వాడరేవులో 700 మోటరైజ్డ్ బోట్లు ఉండగా.. నష్టాలు భరించలేని యజమానులు సగంపైగా బోట్లను బయటకు తెచ్చి నిలిపివేశారు. కలాశీలు పూట గడవక ప్రత్యామ్నాయ పనులు కోసం వలస వెళుతున్నారు.



తీరం వెంబడి నిలిపి ఉంచిన బోట్లు

సాంకేతికత వినియోగంలో వెనుకంజ : సంద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు ప్రభుత్వం జీపీఎస్ ద్వారా వారికి సమీపంలో మత్స్య సంపద ఎక్కడ ఎక్కువగా ఉందనే సమాచారం పంపుతుంది. దీన్ని సద్వినియోగం చేసుకోవడంలో చాలామంది విఫలం చెందుతున్నారు. సరైన అవగాహన లేక కొందరే వినియోగించుకుంటున్నారు. దీనిపై గంగపుత్రులకు అధికారులు సమగ్ర శిక్షణ అందించాల్సి ఉంది.

● చేపలు దొరక్క గంగపుత్రుల విలవిల

● బాగా తగ్గిన ఎగుమతులు

జిల్లాలో..

మత్స్యకార మండలాలు	ఏడు
గ్రామాలు	57
తీరం పరిధి	74 కి.మీ
మెకనైజ్డ్ బోట్లు	232
మోటరైజ్డ్ బోట్లు	2431
ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు	42
బోటు తయారీ కేంద్రాలు	మూడు
జనాభా	60 వేలు
వేటకు వెళ్లేవారు	12 వేలు

వాడరేవు నుంచి నెలకు..

2022లో 200 టన్నులు

2023లో 150 టన్నులు చేపలు, రొయ్యల ఎగుమతి జరిగేది.

2024లో 30 టన్నుల లోపు సరకు లభిస్తోంది.

☛ నూనె తయారీకి వాడే మత్తి రకం చేప గతంలో రోజుకు పది టన్నులు దొరికేది. ప్రస్తుతం అది తగ్గింది.

☛ వాడరేవు నుంచి రోజూ నాలుగు లారీల సరకు ఎగుమతి అయ్యేది. నేడు ఒక లారీకి నిండటంలేదు. లారీలో ఒకటిన్నర టన్నుల సరకు పడుతుంది.



అయోమయంలో ఉన్నాం : కొంతకాలంగా సముద్రంలోకి వెళ్లి వస్తే ఖర్చులు తప్ప చేపలు దొరకడం లేదు. నష్టాలు భరించలేక చివరకు నా బోటును సంద్రంలోనే లంగరు వేసి ఉంచాను. నాలాగే చాలా మంది వేట చేయలేక, ఏం చేయాలో తెలియక అయోమయంలో ఉన్నారు.



ఒడ్డుకు చేర్చా: సముద్ర వాతావరణంలో మార్పుల కారణంగా చేపలు దొరకడం లేదని చర్చ సాగుతోంది. దీంతో రెండు నెలల క్రితం నా బోటును ఒడ్డుకు చేర్చి, నిలిపాను.

ట్రాన్స్‌పాండర్లు ఇవ్వండి: సముద్రంలో దారి తప్పినా.. ప్రమాదవశాత్తు పడవ నిలిచిపోయినా.. సహచరులకు తెలపడానికి, చేపల సమాచారం అందించడానికి ట్రాన్స్‌పాండర్లు బాగా పనిచేస్తాయి. శాటిలైట్ ఆధారంగా పనిచేసే వీటిని స్థానిక మత్స్యకారులకు అందించాలని వివిధ సొసైటీల ప్రతినిధులు కోరుతున్నారు.

వృద్ధురాలి గుడిసె ముంపు సమస్యకు పరిష్కారం

ఈనాడు కథనానికి స్పందన

అద్దంకి, న్యూస్‌టుడే: కొద్దిపాటి వర్షం కురిసినా నీరు పూరి గుడిసెలోకి చేరి ఇబ్బంది పడుతున్న వృద్ధురాలి సమస్య తీర్చారు. 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన 'గుడిసెలోకి వర్షపు నీరు.. వృద్ధురాలికి ఇబ్బందులు' కథనం ప్రచురితమైంది. దీనికి పురపాలక అధికారులు స్పందించారు. తక్షణం కాలువకు అడ్డుగా ఉన్న మట్టిని తొలగించి, నీటిని దిగువకు వెళ్లేలా చేశారు. ఆమె గృహం చుట్టూ బ్లీచింగ్ చల్లారు.



పూరిగుడిసె చుట్టూ బ్లీచింగ్ చల్లుతున్న పురపాలక సిబ్బంది

సాంఘిక శాస్త్రంలో సిలబస్ తగ్గించాలంటూ వినతి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : పదో తరగతి సాంఘిక శాస్త్రంలో సిలబస్ తగ్గించాలంటూ ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్సు ఫోరం తరపున బుధవారం విజయవాడలో విద్యాశాఖ పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టరు ప్రతాపరెడ్డికి వినతిపత్రం అందించారు. పదో తరగతిలో సిలబస్ ఎక్కువగా ఉందని, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. జీవో నంబరు 117 రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల్లోనే మూడు, నాలుగు, అయిదు తరగతులు ఉండేలా చూడాలని అన్నారు. విద్యార్థుల హాజరు శాతంతో సంబంధం లేకుండా మారిన సిలబస్ ప్రకారం పద్దర ఉపాధ్యాయులను కేటాయించాలని వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుర్రం ముత్యాలరావు, డి.శ్రీనివాస్, అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.



పరిశోధన సంస్థ డైరెక్టరు ప్రతాపరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొక్కలతో ఆహ్లాదకర వాతావరణం



మొక్కలతో డీఈవో నారాయణ, విద్యార్థులు

బాపట్ల, న్యూస్‌టుడే: మొక్కల పెంపకం ద్వారా పరిసరాలు పచ్చదనంగా మారి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని డీఈవో నారాయణ అన్నారు. నందిరాజుతోటలోని నర్సరీలో యూజీబీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యవసాయ వృత్తి విద్యా కోర్సు శిక్షణలో భాగంగా వివిధ రకాల మొక్కలు అంటుకట్టే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రెండు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అంటుకట్టే విధానంలో నాణ్యమైన మొక్కలు ఉత్పత్తి అవుతాయన్నారు. కడియం నర్సరీలు దేశంలో ప్రాముఖ్యం పొందాయని తెలిపారు. జిల్లాలో 31 పాఠశాలల్లో పది రకాల వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెట్టామన్నారు. పరీక్షల నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామని ఆయన తెలిపారు.

జ్వర గ్రామాల్లో అయిదో రోజూ వైద్య శిబిరం

✤ 22 మందికి పరీక్షలు

పెదగంజాం (చినగంజాం), న్యూస్‌టుడే: పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం, పాతగొల్లపాలెం గ్రామాల్లో అయిదో రోజైన బుధవారం ఇంటింటికీ 14 మంది వైద్య సిబ్బందిని పంపి సర్వే చేయించినట్లు చినగంజాం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎం.విజయభాస్కరరావు తెలిపారు. ఆ రెండు గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న వైనంపై 'ఈనాడు'లో 'జ్వరంతో మంచమెక్కిన పల్లెలు' శీర్షికతో ఈ నెల 5న కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించి కథనం ప్రచురితమైన రోజైన శనివారం రెండు గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. 15 మందికి, కొత్తగొల్లపాలెంలో ఆదివారం 28 మందికి, సోమవారం 28 మందికి, మంగళవారం 39 మందికి, బుధవారం 22 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు డాక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల వీధుల్లో, పాఠశాల, బహిరంగ ప్రదేశాల్లో బ్లీచింగ్, అబేట్ మందును చల్లించారు. బుధవారం శిబిరానికి వచ్చిన 22 మందిలో ముగ్గురికి ర్యాపిడ్ పరీక్షలు చేయగా వారికి నెగిటివ్ రిపోర్టు వచ్చిందని చెప్పారు. రెండు గ్రామాల్లో మరికొన్ని రోజుల పాటు ఇంటింటికి సర్వే చేయించనున్నట్లు డాక్టర్ విజయభాస్కరరావు తెలిపారు. కొత్తగొల్లపాలెంలోని వైద్య శిబిరాన్ని ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి, ఈవోఆర్డీ బి.సుబ్బారావు పరిశీలించారు. కొందరు ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ విజయభాస్కరరావు

రహదారి అంచులు ఆక్రమణ

కొండాయపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే : బల్లికురవ మండలం కొండాయపాలెం నుంచి సంతమాగులూరు-సజ్జాపురం వెళ్లే దారిని ఆరంభంలో కొందరు తవ్వేసి ఆక్రమణకు పాల్పడ్డారు. దీంతో పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఉపాధిహామీ పథకం కింద ఈ రోడ్డు విస్తరించారు. దీంతో రాకపోకలకు సులభంగా ఉండేది. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఆక్రమణలు పెరిగిపోయాయి. ప్రశ్నించే వారు కరవయ్యారు. మండలంలోని చెన్నుపల్లి, కొండాయపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఈ మార్గాన్ని ఉపయోగిస్తుంటారు. వ్యవసాయ ఉత్పత్తులు ఇటుగానే తరలిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రహదారికి వీలైతే సమీప రైతులు కొంతమేర భూమిని ఉదారంగా ఇవ్వాల్సింది పోయి ఏకంగా ఇది మా హద్దు అన్నట్లుగా యంత్రాలతో కోతకు గురి చేయడాన్ని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈవిషయమై పంచాయతీరాజ్ ఏఈ మాధవరెడ్డిని వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



తవ్వేసిన రోడ్డు అంచు

సినీ ఫక్కీలో ఫోన్లు కొట్టేస్తున్న ఆగంతకులు

అద్దంకి, న్యూస్‌టుడే: ఇప్పటి వరకు మహిళల మెడలో బంగారు ఆభరణాలు లాక్కుని ఉడాయించిన సంఘటనలు చూసిన వింటూ వచ్చాం. తాజాగా యువకుల వద్ద విలువైన ఫోన్లు అపహరించడం, వెంటనే వాటిని స్విచ్ ఆఫ్ చేసి పలాయనం చిత్తగించడం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పట్టణంలో బుధవారం రెండు చోటుచేసుకున్నాయి. నామ్ రహదారిపై భవానీకూడలి వద్ద ద్విచక్ర వాహనాల మెకానిక్ అబ్దుల్ రహీం పని చేస్తున్నారు. ఉదయం ఆయన దుకాణం వద్దకు వచ్చిన ఓ ఆగంతకుడు తన ద్విచక్ర వాహనం పడిపోతుంది.. అంటూ నటించాడు. దీన్ని నిజమని భావించిన మెకానిక్ ఆ వ్యక్తి వద్దకు వచ్చి పడిపోతున్న బండిని పైకి లేపే ప్రయత్నం చేశారు. ఇదే అదనుగా భావించిన మరో వ్యక్తి మెకానిక్ జేబులోని స్మార్టు ఫోన్ లాక్కుని, ఇద్దరూ కలిసి బైక్‌పై పరారయ్యారు. దీంతో చేసేది లేక ఆయన అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

❖ రామ్‌నగర్‌లోని ప్రైవేటు బ్యాంక్ వద్ద నిలబడి ఉన్న ఆర్టీసీ ఉద్యోగి కె.బానుప్రకాష్‌కు ఇలాంటి అనుభవమే ఎదురైంది. తన ద్విచక్ర వాహనం పడిపోతోంది అంటూ ఆగంతక వ్యక్తి డ్రామా సృష్టించడం, ఆర్టీసీ ఉద్యోగి ఆయనకు సాయం చేసేందుకు ప్రయత్నించడం, ఈలోపు మరొకరు అతని వద్ద గల చరవాణితో వెళ్లిపోవటం జరిగాయి. చేసేది లేక ఈయన అద్దంకి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈవిషయమై సీఐ పి.కృష్ణయ్య మాట్లాడుతూ తక్షణం ప్రత్యేక బృందాలను పట్టణంలో గస్తీ తిప్పుతామన్నారు. అపరిచిత వ్యక్తుల చర్యల్ని త్వరగా నమ్మాల్సిన అవసరం లేదని హితవు పలికారు.

ఘాటెక్కిన ఉల్లి .. ఠారెత్తిస్తున్న టమాటా



చిత్తూరు ప్రాంతం నుంచి దిగుమతైన టమాటా బాక్స్‌లు

మార్టూరు, పర్చూరు, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు బహిరంగ మార్కెట్‌లో అమాంతం ఆకాశాన్నంటాయి. ఉల్లి కొనకుండానే కంటనీరు కారుతుండగా టమాటా ఠారెత్తిస్తోంది. మార్టూరు హోల్‌సేల్ మార్కెట్‌లోనూ దిగమతి చేసుకుంటున్న కూరగాయల ధరలు ఎగిసిపడటంతో సామాన్య ప్రజలకు బహిరంగ మార్కెట్‌లో కొని వండాలంటేనే బెంబేలెత్తుతున్నారు. రెండు నెలలుగా నేలచూపులు చూసిన ధరలు కొద్దిరోజులుగా ఒక్కసారిగా పైకి ఎగబాకడం.. కూరగాయలు ముట్టుకుంటేనే మండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోలార్, మదనపల్లె నుంచి దిగుమతులు

మార్టూరు హోల్‌సేల్ మార్కెట్‌లో టమాటాను వ్యాపారులు మదనపల్లె, కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ నుంచి దిగుమతి చేసుకోక తప్పడం లేదు. స్థానికంగా రైతుల నుంచి సరకు లభ్యత కొరవవడంతో చేసేదిలేక ఇతర ప్రాంతాలను ఆశ్రయించక తప్పడం లేదని చెబుతున్నారు. 26 కిలోల టమాటా బాక్స్ రూ.1700 ధర పలకడంతో మార్కెట్ వర్గాలకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఎన్నడు లేని విధంగా వ్యాపారులు దిగుమతికే కిలో రూ.70 వరకు ధర చెల్లించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పది వాహనాల సరకు మార్కెట్‌లో దిగుమతి చేసుకునే వ్యాపారులు ఆచితూచి దిగుమతులకు ముందుకొస్తున్నట్లు తెలుపుతున్నారు. దీంతో బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.100కి చేరిందని సామాన్య ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానమైన ఉల్లిని మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. స్థానికంగా వానలకు ఉల్లి తోటలు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందనేది వ్యాపారుల వాదన. నెల క్రితం పది కిలోల ఉల్లిపాయలు రూ.350 ధరకు దిగుమతి చేసుకున్నారు. మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో మహారాష్ట్ర నుంచి వ్యాపారులు ఉల్లి బస్తాను ప్రస్తుతం పది కిలోలు రూ.600 చొప్పున దిగుమతికి వెనుకాడక తప్పడంలేదు.



దిగుమతి చేసుకుంటున్న దోసకాయ బస్తాలు



మార్టూరు మార్కెట్‌లో పచ్చిమిర్చి

హోల్‌సేల్ మార్కెట్‌లోనూ..

దేశంలోని ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు కూరగాయలు ఎగుమతి చేసే మార్టూరు మార్కెట్‌లో హోల్‌సేల్ ధరలు కొద్దిరోజులుగా అమాంతం పెరగడంతో బహిరంగ మార్కెట్‌లో వినియోగదారుల జేబుకు చిల్లెడుతున్నాయి. ఆగ్రా నుంచి దిగుమతయ్యే బంగాళాదుంపలు పది కిలోలు రూ.250- రూ.350 ధర చెల్లిస్తున్నట్లు ఇక్కడి వ్యాపారులు వెల్లడిస్తున్నారు. పది కిలోల దొండకాయలు మాత్రం ఒక్కసారిగా హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.600కి చేరాయి. బెండకాయలు రూ.250, బీరకాయలు రూ.250-రూ.400, పచ్చిమిర్చి రూ.200-రూ.300, కాకరకాయ రూ.300-రూ.400, వంగ రూ.300-రూ.400, గోరుచిక్కుళ్లు రూ.200-రూ.250, 50 కిలోల దోసకాయల టిక్కీ రూ.1200-రూ.1500 ధర పలుకుతున్నాయి. దీంతో బహిరంగ మార్కెట్‌లోకి వెళ్లేసరికి మరింతగా ఎగిసిపడుతున్నాయని సామాన్యులు వాపోతున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

కారు ఢీకొని మహిళ మృతి

పాతమాగులూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: అమరావతి-అనంతపురం జాతీయ రహదారిలో పాతమాగులూరు వద్ద అదుపు తప్పి కారు ఢీకొన్న ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ఎం.పట్టాభి రామయ్య తెలిపిన వివరాల ప్రకారం. పాతమాగులూరుకు చెందిన ఓ ప్రైవేటు వైద్యుని తల్లి జానవత్ లక్ష్మీబాయి (68) అరోగ్యం సరిగా లేకపోవడంతో నరసరావుపేట ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొంది, తిరిగి బస్సులో స్వగ్రామానికి ప్రయాణమయ్యారు. పాతమాగులూరు వద్ద బస్సు దిగి ఇల్లు చేరేందుకు రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వెళుతున్న కారు అదుపు తప్పి, ఢీకొట్టింది ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మృతురాలు లక్ష్మీబాయి

వృద్ధురాలిపై దాడి.. కేసు నమోదు

కారంచేడు (మార్టూరు): స్వర్ణకు చెందిన వృద్ధురాలు ఎల్.బుల్లెమ్మపై జరిగిన దాడిపై కేసు నమోదు చేసినట్లు కారంచేడు పోలీసులు బుధవారం తెలిపారు. గతంలో నెలకొన్న భూ వివాదంపై సమీపంలో నివసించే టి.శ్రీనివాసరావు దాడి చేసినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైటర్ శ్రీనివాసరావు తెలిపారు.

అద్దంకి మేజరులో గుర్తు తెలియని మృతదేహం

మార్టూరు, అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి మేజరులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. మార్టూరు సీఐ శేషగిరిరావు అందించిన సమాచారం మేరకు.. కాలువలో కొమ్మినేనివారిపాలెం మలుపు వద్ద గుర్తుతెలియని సుమారు 40 సంవత్సరాల పురుషుడి మృతదేహం కనిపించింది. శరీరంపై ఎలాంటి దుస్తులు లేకుండా కేబుల్‌తీగల కారణంగా కాలువలో నిలిచింది. స్థానికుల సహాయంతో దాన్ని గుర్తించి, ఒడ్డుకు చేర్చారు. అనంతరం వలపర్ల వీఆర్వో వి.అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? చావలి నుంచి భట్టిప్రోలు వెళ్లే మార్గంలో కొత్తపాలెం వద్ద రహదారి పక్కన చెత్త వేస్తున్నారు. అందులో మిగిలిపోయిన భోజన పదార్థాలు ఉండడం వల్ల వాటిని కుక్కలు, పందులు చిందర వందర చేస్తున్నాయి.

✔ వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి, చెత్త తొలగించడానికి చర్యలు చేపడతాం.

- శేఖర్, ఈవోపీఆర్డీ. -న్యూస్‌టుడే, వేమూరు

? కావూరులో రెండు రోజులుగా వీధి దీపాలు పగలు కూడా వెలుగుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు.

-చిన్న సుబ్రమణ్యం, కావూరు

✔ వీధి దీపాల నిర్వహణ పనులు జరుగుతున్నాయి. అందువల్ల పగలు దీపాలు వెలిగించాల్సి వచ్చింది. పగలు దీపాలు వెలగకుండా సిబ్బందిని అప్రమత్తం చేసి సమస్య పరిష్కరిస్తాం. **-డోగేంద్ర, పంచాయతీ కార్యదర్శి, కావూరు**

-న్యూస్‌టుడే, కావూరు (చెరుకుపల్లి గ్రామీణ)

బాపట్ల పట్టణాభివృద్ధికి కృషి చేస్తా


రఘునాథరెడ్డి, పురపాలక కమిషనర్

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని పురపాలక కమిషనర్ జి.రఘునాథరెడ్డి అన్నారు. ప్రొద్దుటూరు నుంచి బదిలీపై ఆయన బాపట్ల వచ్చారు. స్థానిక పురపాలక కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. రఘునాథరెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. పట్టణవాసులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానని పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఉపాధి కల్పించాలి

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ వెంకట మురళికి జనసేన దివ్యాంగుల విభాగం నేత గోగన ఆదిశేషు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్లో కలెక్టర్‌ను ఆయన బుధవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆదిశేషు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగుల రాకపోకల కోసం ర్యాంప్‌లు నిర్మించాలని కోరారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని బాపట్లలో ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు 106 దరఖాస్తులు

వేమూరు,న్యూస్‌టుడే: మద్యం దుకాణాలు టెండర్లు వేయడానికి ఈనెల 11 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినట్లు వేమూరు అబ్కారీ శాఖ సీఐ రవి తెలిపారు. అయితే బుధవారం సాయంత్రం వరకు నియోజకవర్గంలోని 17 మద్యం దుకాణాలకు కలిపి 106 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. వేమూరు మండలంలో మూడు దుకాణాలకు 35, కొల్లూరులోని నాలుగు దుకాణాలకు 17, అమృతలూరులోని రెండు దుకాణాలకు 15, చుండూరులోని మూడు దుకాణాలకు 12, భట్టిప్రోలు లోని ఐదు దుకాణాలకు 27 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

వేడుకగా శ్రీవారికి సువర్ణ శంఖు చక్రధారణ

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని దాతల విరాళాలతో తయారు చేయించిన సువర్ణ శంఖు చక్రధారణను బుధవారం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, శ్రీనివాస ఇష్టకామితార్థా హోమం, వివిధ రకాల పుష్పాలతో సహస్రనామార్చన చేశారు. వీటిని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విజయవాడ-శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : దసరా రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ- శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07215 ప్రత్యేక రైలు ఈ నెల 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో విజయవాడలో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కి శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు నంబరు 07216 ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో ఉదయం 6.30కి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుతుంది. ఈ బండి ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతుంది.

ఎట్టకేలకు అడుగులు ముందుకు

మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణంలో కదలిక

కూటమి ప్రభుత్వ రాకతో మొదటి ప్లాంటు పనులకు శ్రీకారం

బాపట్ల, న్యూస్‌టుడే

గత వైకాపా పాలనలో బాపట్ల పట్టణంలో మూడు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఏడాదిన్నర క్రితమే నిర్ణయించినా పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి నిర్మాణంపై దృష్టి పెట్టింది. పురపాలక సంఘంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపీ) నిర్మాణంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఈస్ట్, వెస్ట్ స్వాంప్ మురుగు కాలువల్లో నీటి శుద్ధి కోసం రూ.5.40 కోట్లతో మొదటి ప్లాంట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.


వెస్ట్ స్వాంప్ మురుగుకాలువ


ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణానికి కేటాయించిన భూమి

మూడు మిలియన్ లీటర్ల నీటి శుద్ధి

పురపాలక సంఘంలోని 34 వార్డుల నుంచి మురుగునీరు వచ్చి ఈస్ట్ స్వాంప్, వెస్ట్ స్వాంప్, భీమునిగుంట వాగులో కలుస్తోంది. ఈ నీటితో శివారు ప్రాంత రైతులు వరి, కూరగాయలు, ఆకుకూరలు, పూలతోటలు, అపరాలు, వేరుశనగ సాగు చేస్తున్నారు. పట్టణం నుంచి వచ్చే మురుగునీరు శుద్ధి చేసిన తర్వాత వ్యవసాయ అవసరాలకు వినియోగించాలి. కానీ ప్రస్తుతం మురుగునీటిని నేరుగా పంటల సాగుకు వాడుతున్నారు. 2022లోనే మురుగునీటి శుద్ధి ప్లాంట్లు మూడు నిర్మించాలని నిర్ణయించారు. వెస్ట్‌స్వాంప్ మురుగుకాలువ నుంచి రోజూ మూడు మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే ప్లాంటు నిర్మాణానికి డంపింగ్ యార్డు వద్ద ఎకర్నర భూమి కేటాయించారు. వైకాపా పాలనలో నిర్మాణ పనులు చేసే బిల్లులు రావని భయపడి గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో పనులు ముందుకు కదలలేదు.

వ్యవసాయ, ఉద్యాన పంటలకు శుద్ధి నీరు అందించడమే ధ్యేయం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. మొదటి ప్లాంటు నిర్మాణ పనులు ప్రారంభించటానికి గుత్తేదారు సన్నాహాలు చేస్తున్నారు. ప్లాంటుకు కేటాయించిన ఎకర్నర భూమిని చదును చేస్తున్నారు. నిర్మాణ పనులు ప్రారంభించి మురుగుకాలువల్లో రోజుకు మూడు మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసి తర్వాత వ్యవసాయ అవసరాలకు విడుదల చేయనున్నారు. మూలపాలెంలో ఓ ఎంఎల్‌డీ సామర్థ్యంతో రెండో ప్లాంటు నిర్మించాల్సి ఉంది. అయితే ఎకరా భూమి కావాల్సి ఉంది. స్థానికంగా ఉన్న అసైన్డ్ భూమిని కేటాయించాలని రెవెన్యూ అధికారులను పురపాలక అధికారులు కోరారు. ఐదు ఎంఎల్‌డీ సామర్థ్యంతో మూడో ప్లాంటు మరుపోలువారిపాలెం పరిధిలో నిర్మించాలి. దీని కోసం రెండున్నర ఎకరాల భూమిని కేటాయించాల్సి ఉంది. ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవటంతో భూసేకరణ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయాలి. ఇక్కడ నీటిని శుద్ధి చేసి వ్యవసాయ, ఉద్యాన పంటలకు అందించాలి.

భూసేకరణ పూర్తయితే మిగతా రెండు ప్లాంట్ల నిర్మాణం

మొదటి మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణ పనులను గుత్తేదారు ప్రారంభించారు. త్వరలో పూర్తి చేసి వెస్ట్ స్వాంప్ కాలువలో మురుగునీటిని శుద్ధి చేస్తాం. భూసేకరణ పూర్తయితే రెండు, మూడు ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది.

-శ్రీనివాసులు, పురపాలక డీఈ


బ్రాహ్మణ సమాఖ్య మండపంలో.. | కావూరులో.. | ఇసుకపల్లిలో.. | పేటేరులో.. | ఉల్లిపాలెంలో.. | యేమినేనివారిపాలెంలో కనకదుర్గమ్మ విగ్రహం | జంపని శివాలయంలో.. | నల్లమోతువారిపాలెంలో..

జ్ఞాన ప్రదాయిని..సకలజనుల జనని


వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు


శంకర విద్యాలయంలో.. | పాండురంగస్వామి ఆలయంలో సరస్వతీ పూజలో విద్యార్థులు, తల్లులు

ఈ గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మూలా నక్షత్రం సందర్భంగా ఏడోరోజైన బుధవారం అమ్మవారు చదువుల తల్లి సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల వద్ద సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తులో పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

-న్యూస్‌టుడే బృందం


వెల్లటూరులో.. | భట్టిప్రోలులో..


ఖాజీపాలెంలో.. | అల్లూరులో.. | అమృతలూరు గోవాడ శైవక్షేత్రంలో.. | కోదండ రామాలయంలో మహాలక్ష్మీదేవిగా | వజ్రకవచ అలంకృత కన్యకాపరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్ | కన్యకాపరమేశ్వరి ఆలయంలో.. | పోలేరమ్మ ఆలయంలో.. | మూడోవార్డులో..

ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలి



బాపట్ల: మాట్లాడుతున్న ఎంపీడీవో బాబూరావు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాల తీరు తెన్నులపై స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో బి.బాబురావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు గ్రామ పంచాయతీ పరిపాలనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రాథమిక విధులైన మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్తు సౌకర్యంతో పాటు సంక్షేమ పథకాల అమలు, పరిపాలనపై స్థానిక ప్రజాప్రతినిధులు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

నగరం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులతో పాటు ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు భాగస్వాములు కావాలని కార్యనిర్వహణాధికారి బొర్రా శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉప సర్పంచులు, వార్డు మెంబర్ల శిక్షణా తరగుతుల్లో ఆయన పాల్గొనారు.

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : వార్డు సభ్యుల సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ దావూరి వెంకటలలితకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సర్పంచి, వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణను బుధవారం ఎంపీపీ ప్రారంభించారు.

నార సంచులతో పర్యావరణ పరిరక్షణ

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పురపరిపాలన శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై స్థానిక మున్సిపల్ పరిధిలో నిషేధించినట్లు కమిషనరు అబ్దుల్ రషీద్ తెలిపారు. వీటిని వాడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బుధవారం తన కార్యాలయంలో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నార సంచులను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రతి ఒక్కరు వీటిని వినియోగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. సమితి అధ్యక్షుడు సీహెచ్‌కృష్ణమూర్తి, సభ్యులు ఉన్నారు.

లారీ ఢీకొని ముగ్గురు యువకులకు గాయాలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : అతి వేగంతో ప్రయాణిస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. బాధితులు బాపట్ల ప్రాంతీయ వైద్యశాల ఔట్‌పోస్ట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. బుధవారం కర్లపాలెం మండలం నర్రావారిపాలేనికి చెందిన నక్కల గోపిచంద్, కోమట్ల పవన్‌కుమార్, అజయ్‌రెడ్డి ద్విచక్రవాహనంపై బాపట్లకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎదురుగా అతివేగంతో ప్రయాణిస్తున్న లారీ మండల పరిధిలోని నందిరాజుతోట సమీపంలోని హోలీక్రాస్ స్కూల్‌వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో గోపిచంద్ కుడికాలు విరగగా పవన్‌కుమార్, అజయ్‌రెడ్డిలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాపట్ల గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి..

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : రోడ్డు దాటుతున్న వ్యక్తిని అతివేగా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనటంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన కుమ్మరిపాలెంలో చోటుచేసుకుంది. బాధితుడు బాపట్ల ప్రాంతీయ వైద్యశాల ఔట్‌పోస్ట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండల పరిధిలోని జమ్ములపాలేనికి చెందిన కొమ్మినేని దుర్గాప్రసాద్ పట్టణంలోని కుమ్మరిపాలెం వద్ద ఉన్న టింబర్‌డిపోలో పనిచేస్తుంటాడు. బుధవారం పనికి వచ్చిన దుర్గా ప్రసాద్ కుమ్మరిపాలెం వద్ద గల మహాలక్ష్మి చెట్టు వద్ద అల్పాహారం తిని రోడ్డు దాటుతుండగా చీరాల వైపు నుంచి అతివేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు, ఎడమ చేతికి గాయాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం ?

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని ఈతేరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌లో ఆ వ్యక్తిని విపరీతంగా కొట్టి కేసు నమోదు చేయకుండా వదిలేసినట్లు సమాచారం. పోలీసులు కొట్టారని మనస్తాపం చెంది సదరు వ్యక్తి బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో కుటుంబ సభ్యులు బాపట్ల ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. దీంతో ఆ వ్యక్తి ఆత్మహత్యాయత్నం కేసు తమ మీదకు వస్తుందనే భావనతో బుధవారం మధ్యాహ్నం గ్రామీణ పోలీసులు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై గ్రామీణ సీఐ కె.గంగాధర్‌ను వివరణ కోరగా కేసు నుంచి బయటపడేందుకు ఓ వ్యక్తి ప్రోద్బలంతోనే మద్యం విక్రయించే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు నాటకమాడాడని, కొట్టినట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవాలు లేవని ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విజయబాబు

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం చేసి అధిక పంట దిగుబడి సాధించేలా రైతులు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ రేపల్లె సహాయ సంచాలకుడు రాగల విజయబాబు సూచించారు. రేపల్లె మండలం అరవపల్లిలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యాక్రమం నిర్వహించి మాట్లాడారు. సేంద్రియ ఎరువులు వాడితే ఖర్చు తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు వినియోగిస్తే భూసారం తగ్గుతుందని గ్రహించాలని ఆయన కోరారు.

మోపర్రు, వామనగుంటపాలెం,(అమృతలూరు), న్యూస్‌టుడే: వరిపైరులో అక్కడక్కడ అగ్గి తెగులు ఆశించినట్లు ఏవో లోకేశ్వరి తెలిపారు. మోపర్రు, వామనగుంటపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 120గ్రా. మందు ద్రావణాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె సూచించారు.

అటు వెళ్తే ఒళ్లు హూనమే

అధ్వానంగా నిజాంపట్నం- రేపల్లె రహదారి

నిజాంపట్నం, న్యూస్‌టుడే : తీర ప్రాంత ప్రజలు నియోజకవర్గ కేంద్రానికి చేరాలంటే నిజాంపట్నం- రేపల్లె ఆర్‌అండ్‌బీ రహదారే ప్రధానం. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కనీసం రహదారులు మరమ్మతులకు నోచుకోపోవడంతో ప్రయాణికులకు శాపంగా మారింది. ఆర్టీసీ సర్వీసులు అంతంత మాత్రంగా ఉండే తీర గ్రామాల ప్రజలు ఆటో ప్రయాణం తప్పనిసరి వాటిలో ప్రయాణం చేయడం అంటే ఒళ్లు హూనమైనట్లే లెక్కని ప్రయాణికులు వాపోతున్నారు. 25 కి.మీ దూరం ఉన్న రేపల్లె మార్గం అడుగడుగునా గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. నిజాంపట్నం సినిమాహాలు సమీపంలో, బావాజీపాలెం, పుర్లమెరక, పల్లపట్ల, చింకపాలెం, సజ్జవారిపాలెం నుంచి ఇసుకపల్లి వరకు పూర్తిగా రూపు రేఖలు మారి ప్రయాణం అంటేనే భయం వేసేలా మారిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ మార్గంలో సుమారు రెండువేల పైన గుంతలున్నాయి.


గుంతల మయంగా రేపల్లె-నిజాంపట్నం ప్రధాన రహదారి

వేల సంఖ్యలో వాహనాల ప్రయాణం

మండలం నుంచి నిత్యం ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాలపై సుమారు 15వేలకుపైగా ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ఏళ్లుగా ఈ మార్గం నిర్లక్ష్యానికి గురవడంతో నియోజకవర్గ కేంద్రం వెళ్లాలంటే రహదారి సరిగా లేదని ప్రజలు వాపోతున్నారు. తక్షణం అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

తక్షణం మరమ్మతులు చేయాలి



తీరంలో ప్రధాన రహదారులు అధ్వానంగా మారి వాటిపై ప్రయాణ చేయడమంటే పరీక్షలా మారింది. ముఖ్యంగా అడవులదీవి- రేపల్లె, నిజాంపట్నం- రేపల్లె రహదారులు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సజ్జవారిపాలెం నుంచి రేపల్లెకు వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. తక్షణం మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

-వెంకటేశ్వరరావు, ప్రయాణికుడు

నిధులు మంజూరయ్యాయి

రేపల్లె-నిజాంపట్నం రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. వర్షాలు కురవడంతో పనులు నిలిపివేశాం. త్వరలో ప్రారంభిస్తాం. **-విద్యాసాగర్ ఏఈ ఆర్అండ్‌బీ, నిజాంపట్నం**

మూగజీవాల చేష్టలు.. ప్రజలు హడలు

బెంబేలెత్తిస్తున్న ఆవులు, వానరాలు, శునకాలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : మూగజీవాల కారణంగా పట్టణ ప్రజలు బెంబెలేత్తిపోతున్నారు.. ఆవులు ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగిస్తుంటే వానరాలు ఇళ్లల్లోకి చొరబడి సామగ్రి, దుస్తులు, తినుబండారాలను నాశనం చేస్తున్నాయి. ఇక శునకాలు ద్విచక్రవాహనదారులు, పాదచారుల వెంట పడుతూ భయపెడుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఆవులు పట్టణ ప్రధాన కూడలి ప్రాంతాల్లో తిష్టవేస్తూ ట్రాఫిక్‌కు ఆటకం కలిగిస్తూ ఆదిలిస్తే కుమ్మేందుకు కూడా యత్నిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విజయలక్ష్మీపురం, త్యాగరాయనగర్, రైలుపేట, ఇస్లాంపేటలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఇంటి పెరట్లో కూరగాయలు, పూల మొక్కలు, పండ్ల చెట్లను వానర సైన్యం ధ్వంసం చేస్తున్నాయి. ఆరుబయట ఆరేసిన దుస్తులను చించి వేస్తున్నాయి. ఇటీవల కూరగాయలు విక్రయిస్తున్న మహిళపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. మరోవైపు పట్టణంలోని అన్ని వార్డుల్లో శునకాలు పదుల సంఖ్యలో మూకుమ్మడిగా పాదచారులు, ద్విచక్రవాహనాల వెంబడి పరుగులు పెడుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అంతేకాకుండా శునకాలు.. వానరాలు ఎదురైతే ఒకవర్గంపై మరొక వర్గం దాడి అన్నట్లుగా ఆ ప్రాంతమంతా గందరగోళంగా భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని, ఆవైపుగా వెళ్లాలంటే భయపడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పురపాలక ఏఈ ఉమామహేశ్వరరావును ప్రశ్నించగా కోతులను పట్టించి పట్టణానికి దూరంగా వదిలిపెడతామన్నారు.


ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ గుంపులుగా సంచరిస్తున్న ఆవులు


దాడి చేసుకుంటున్న వానరాలు..శునకాలు


కోతుల దాడిలో గాయపడ్డ మహిళ

శిథిల భవనం.. విష పురుగులకు నిలయం



రేపల్లె 25 వార్డులో గతంలో నిర్మించిన గ్రామ కచేరీ భవనం శిథిలమై కొంత భాగం కూలింది. ఏళ్లుగా నిరుపయోగంగా మారిన కచేరీ పరిసరాల్లో మొలిచిన పిచ్చి చెట్లు విష సర్పాలకు నిలయంగా మారాయి. పాములు రోడ్లపైకి రావడంతో రాకపోకలు సాగించే బాటసారులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. విషపురుగులతో ఎవరికీ ప్రాణాపాయం కలగకముందే కచేరి పరిసరాలను పరిశుభ్రం చేయించాలని లేదా పూర్తిగా కూల్చివేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ సమస్య మా దృష్టికి రాలేదని తక్షణం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. **-న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్**

సందడిగా నాటకోత్సవాలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కళలకాణాచి తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ స్థాయి నాలుగో పద్య, సాంఘిక నాటకాలు, నాటికల పోటీలు బుధవారం తెనాలి రామకృష్ణ కళాక్షేత్రంలో సందడిగా సాగాయి. గంగోత్రి పెదకాకాని వారి అష్టమ పసుపు, విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాదు వారి స్వేచ్ఛ నాటకాలు, పూర్ణోదయా ఆర్ట్స్ చీరాల వారి నేనేం చేసుకుంటాను, రసఝరి పొన్నూరు వారి గురితప్పిన వేట నాటికలలో నటీనటుల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

రెవెన్యూ భూసమస్యలకు సత్వర పరిష్కారం: ఆర్డీవో అఖిల



చీరాల ఆర్డీవో అఖిలకు సమస్య వివరిస్తున్న మహిళ

బల్లికురవ (అద్దంకి), న్యూస్‌టుడే: రెవెన్యూ భూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చీరాల ఆర్డీవో డి.అఖిల అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. స్థానికంగా నెలకొన్న భూసమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా అర్జీదారులతో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచన మేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వారానికి ఒక మండలాన్ని ఎంపిక చేసుకుని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే నంబర్ల మార్పు, పట్టాదారు పాస్ పుస్తకాలు రాకపోవటం వంటి సమస్యలతో బాధపడుతున్న వంద మంది అర్జీదారులు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహసీల్దార్ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నార సంచులతో పర్యావరణ పరిరక్షణ



జ్యూట్ బ్యాగులు ఆవిష్కరించిన కమిషనర్ అబ్దుల్ రషీద్, సేవా సమితి సభ్యులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పురపరిపాలన శాఖ సంచాలకుల ఆదేశం మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని స్థానిక మున్సిపల్ పరిధిలో నిషేధించినట్లు కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. వీటిని వాడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బుధవారం తన కార్యాలయంలో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నార సంచులను ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రతి ఒక్కరు వీటిని వినియోగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. సమితి అధ్యక్షుడు సీహెచ్.కృష్ణమూర్తి, సభ్యులు ఉన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోలలపూడి ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వవిద్యార్థులు

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని కోలలపూడిలో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. 1987-88లో 10వ తరగతి అభ్యసించిన అప్పటి విద్యార్థులంతా సమావేశమయ్యారు. ఈసందర్భంగా తమ పాఠశాల అభ్యున్నతికి దోహదపడాలని తీర్మానించుకున్నారు. అప్పటి తమ గురువులు హనుమంతరావు, జగన్ మోహన్‌రావు, సుబ్బమ్మ, వెంకయ్యను ఘనంగా సత్కరించారు. సర్పంచి ఎం.సతీష్‌కుమార్, కందిమళ్ల రామకోటేశ్వరరావు, పూనూరు హెచ్ఎం శ్రీనివాసరావు హాజరై సమ్మేళనాన్ని కొనియాడారు. పూర్వ విద్యార్థులు దాసరి శ్రీనివాసరావు, వెంకటరావు, మల్లికార్జున, సాంబశివరావు, హరిబాబు, ప్రభాకర్, భూలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరులో వర్షం

సంతమాగులూరు, న్యూస్‌టుడే: సంతమాగులూరు మండలంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లులు పడ్డాయి. ప్రస్తుతం మండలంలో వరి నాట్లు, కూరగాయలు, మిరప పైరు సాగులో ఉన్నాయి. గత వారం రోజులుగా ఎండ వేడిమితో వేసవిని తలపిస్తున్న వాతావరణం వర్షపు జల్లులతో చల్లబడింది. సంతమాగులూరు ఎన్నెస్పీ సబ్ డివిజన్ పరిధిలోని 35 వేల ఎకరాల్లో ఆరుతడి వ్యవసాయ భూములున్నా సజ్జాపురంలో ఈ ఏడాది 1,600 ఎకరాలలో పైగా మొక్కజొన్న సాగుకు రైతులు దుక్కులు సిద్ధం చేశారు. వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో కురిసిన వర్షంతో మొక్కజొన్న నాటడానికి అనుకూలంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతోపాటు ఇప్పటికే సాగు చేసిన పైర్లకు వర్షం అనుకూలంగా ఉందని వారు తెలిపారు.

వాగ్దేవి వందనం



చీరాల: పాపరాజుతోటలో కుంకుమ పూజలో మహిళలు



వేటపాలెం కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతి పూజలో చిన్నారులు



ఇంకొల్లులో..



పర్చూరులో అద్దంకి నాంచారమ్మ..



సరస్వతీదేవిగా పర్చూరు కన్యకాపరమేశ్వరి



జాగర్లమూడిలో..



మేదరమెట్ల: రావినూతలలో..

చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో దసరా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆయా మండలాల్లోని ఆలయాలు, మండపాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులు పూజలు చేస్తున్నారు. ఏడో రోజు బుధవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాగ్దేవి సరస్వతీ మాత పూజలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే బృందం



కారంచేడులో..



చినగంజాంలో..



అద్దంకి: ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సరస్వతీ పూజ..



అద్దంకి: మహాసరస్వతిగా..



అద్దంకి పోలేరమ్మ ఆలయంలో..



కారంచేడులో..



నాయునిపల్లి శివాలయంలో..



ద్రోణాదులలో..

కూలిన కాలువ రక్షణ గోడ



యద్దనపూడి, న్యూస్‌టుడే: యద్దనపూడి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు సాగు, తాగునీరు సరఫరా చేసే సాగర్ కాల్వ నీటి ప్రవాహం ప్రమాదకర స్థాయిలో సాగుతోంది. బుధవారం పూనూరు సమీపంలోని ఎన్ఎస్పీ కాల్వ సైఫన్ వద్ద కాల్వ కట్ట రక్షణ గోడ కూలిపోవడమేకాక, రాతి కట్టడానికి రంధ్రం ఏర్పడి సాగునీరు వృథాగా పోయింది. దీంతో కాల్వ కట్టలు ఏ సమయంలో తెగిపోతాయో అర్థంకాక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్థులు సంఘటన స్థలిని పరిశీలించి రంధ్రం ఏర్పడిన కట్టడం వద్ద అడ్డుగా ఇసుక బస్తాలతో కొంతమేర రక్షణ కల్పించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ముంపు సమస్యలు పరిష్కరించండి

మణికేశ్వరం(అద్దంకి), న్యూస్‌టుడే: గుండ్లకమ్మ జలాశయం ముంపు గ్రామం మణికేశ్వరంలో నెలకొన్న సమస్యలు తక్షణం పరిష్కరించాలంటూ గ్రామస్థులు జలాశయం ప్రత్యేక ఉప కలెక్టర్ టీవీ. సునీల్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. ముస్లింలకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూసేకరణ పూర్తి చేయాలని, ముంపు వాసులు సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరారు. ఐటీడీపీ నేత కరీముల్లా నేతృత్వం వహించారు.

పొదుపుతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న శ్రీకృష్ణ చైతన్య

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పొదుపు, మదుపు పాటిస్తే ఆర్థికంగా ఎదుగుతారని మిరేఏసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఏపీ, తెలంగాణ ప్రతినిధి శ్రీకృష్ణ చైతన్య పేర్కొన్నారు. మీరేఏసెట్, జన్‌మనీ సంయుక్తంగా ఇంకొల్లులోని శుభమస్తు కల్యాణ మండపంలో బుధవారం ఆర్థిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కృష్ణ చైతన్యతోపాటు జెన్‌మనీ ఇన్వెస్ట్‌మెంట్ అనలిస్ట్ జె.వేణుగోపాల్, పర్సనల్ ఫైనాన్షియల్ ప్లానర్ వి.కృష్ణారావులు ఆదాయపన్ను, స్థిరాస్థి పన్ను, మదుపు, పొదుపు పద్ధతులు, అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థలో మదుపు చేయటం ద్వారా సామాన్య వ్యక్తులకు కలిగే ప్రయోజనాలు, ద్రవ్యోల్బణానికి మించి రాబడి పొందేమార్గాలను తెలియజేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వ్యాపారులు 150మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకట సుబ్బారెడ్డి, జెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ సుబ్బారెడ్డి



ఎంపీడీవో రాజ్యలక్ష్మి



వెంకటరత్నం (ఇంకొల్లు)

కొరిశపాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే: కొరిశపాడు మండల తహసీల్దార్‌గా జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవోగా రాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొరిశపాడు మండలంలో గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటేశ్వరరావు బాపట్ల కలెక్టర్ కార్యాలయానికి, ఎంపీడీవోగా పనిచేసిన సురేష్‌బాబు సంతనూతలపాడుకు బదిలీపై వెళ్లారు.

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు తహసీల్దార్‌గా ఎస్.వెంకటరత్నం నియమితులయ్యారు. కర్లపాలెం తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇంకొల్లుకు బదిలీ అయ్యారు. బుధవారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రమీలను నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. వెంకటరత్నంకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? మార్టూరు పట్టణ పరిధిలోని సీతాదేవి నగర్ ప్రధాన మార్గంలో కరెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. కానీ దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు ఆవైపు నడవాలంటేనే గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.

-బ్రహ్మయ్య, శేషుబాబు, మార్టూరు

✔ వెంటనే సిబ్బందిని పంపించి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. **- టి.శ్రీనివాసరావు, ఈవో మార్టూరు పంచాయతీ**

? అద్దంకి వ్యవసాయ కార్యాలయం సమీపంలో చెత్తను కార్యాలయం పక్కనే పడేస్తున్నారు. ఎన్ని సార్లు చెప్పినా గృహాల వారు వినిపించుకోవటం లేదు. వర్షం కురిసిన సమయంలో పాములు, తేళ్లు చెత్తలో ఉంటున్నాయి. చెత్తను తొలగించాలి **- శేషగిరిరావు, వాసవీనగర్, అద్దంకి**

✔ వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటా. **- బలరామిరెడ్డి, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, అద్దంకి పురపాలక సంఘం.** -అద్దంకి, న్యూస్‌టుడే

డొక్కా సీతమ్మ పేరిట అన్నదానం



అన్నదానం చేస్తున్న జనసేన ప్రతినిధులు

ఇంకొల్లు: ప్రముఖ సంఘ సేవిక డొక్కా సీతమ్మ పేరిట జనసేన ఎన్నారై విభాగ ప్రతినిధి మన్యం శ్రీకాంత్ జట్టు బుధవారం ఇంకొల్లులోని పర్చూరు రోడ్డు అంకమ్మ కాలనీలో అన్నదానం చేశారు. ఏడు వారాలుగా ప్రతి బుధవారం డొక్కా సీతమ్మ పేరిట ఇంకొల్లులోని వివిధ కాలనీల్లో అన్నదానం నిర్వహిస్తున్నారు. జనసేన ప్రతినిధులు నారిశెట్టి ప్రవీణ్, ఆర్కే రెడ్డి, మహేష్, వెంకటేశ్వర్లు, చంటి, సిద్ధికఖ, అబుకర్, ముస్తాఫా పాల్గొన్నారు.

వెండి కడియం బహూకరణ

సోపిరాల (చినగంజాం): సోపిరాలలోని శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలోని స్వామి వారి చేతికి అలంకరించేందుకు రూ.25 వేల వ్యయంతో తయారు చేయించిన వెండి కడియంను గుంటూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పోలకం పవన్‌సాయి సమకూర్చగా అతని తల్లిదండ్రులు శరభారావు, లక్ష్మీకుమారీ దంపతులు ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ అంజనేయులు, అర్చకుడు శంకర్ మిశ్రాలకు బుధవారం అందజేశారు.

వేడుకగా శ్రీవారికి సువర్ణ శంఖు చక్రధారణ



ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని దాతల విరాళాలతో తయారు చేయించిన సువర్ణ శంఖు చక్రధారణను బుధవారం అత్యంత వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, శ్రీనివాస ఇష్ట కామితార్థా హోమం, వివిధ రకాల పుష్పాలతో సహస్రనామార్చన చేశారు. వీటిని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవ పూజలు



చినగంజాం వీధుల్లో స్వామి వారి పల్లకీ ఉత్సవం

చినగంజాం: చినగంజాం పురాతన శ్రీభూసమేత భావనారాయణస్వామి 17వ వార్షికోత్సవ పూజలు బుధవారం ఘనంగా ముగిశాయి. చినగంజాం వీధుల్లో స్వామి వారికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థునులు చేసిన కోలాటం ఆకట్టుకుంది. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

వృద్ధాశ్రమానికి రూ.25వేల వితరణ

మార్టూరు: మార్టూరు అమ్మ ఆశ్రమానికి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి డి.కనకరత్నాచారి, పద్మావతి దంపతులు రూ.25 వేల నగదును వితరణ చాటారు. మార్టూరులోని కొణిదెన రోడ్డులో నిర్మిస్తున్న నూతన భవనానికి ఈ ఉదారతను చాటారని ఆశ్రమ ఛైర్మన్ గుంటుపల్లి చందు తెలిపారు. బుధవారం మార్టూరు విచ్చేసిన రత్నాచారి కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని పేదలు, వృద్ధులకు అన్నదానం నిర్వహించి మిఠాయిలు, పండ్లు పంచారు. ఎం.అనంతాచారి, కె.వినయ్, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలు, పరిపాలనపై అవగాహనతో మెలగాలని ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు సత్కారం

అద్దంకి, న్యూస్‌టుడే: ఆణిముత్యాలు లాంటి వారు నాటి తరం రెవెన్యూ ఉద్యోగులని తహసీల్దార్ జి.శ్రీచరణ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళుతున్న ఇద్దరు ఉప తహసీల్దార్‌లు, ఒక జూనియర్ సహాయకుల్ని సత్కరించి, జ్ఞాపిక అందించారు. సభకు ఆర్ఐ రామారావు(శంకర్) అధ్యక్షత వహించారు. అద్దంకి ఎన్నికల ఉప తహసీల్దార్‌గా పనిచేసిన బి.విజయభాస్కరరెడ్డి సంతమాగులూరుకు, అద్దంకి ఉప తహసీల్దార్ కె.కృష్ణమోహన్ కొరిశపాడు ఆర్ఐగా, జూనియర్ సహాయకులు పి.సందీప్ పుల్లలచెరువుకు బదిలీ అయ్యారు. ఆమేరకు ముగ్గురిని సన్మానించారు. సహాయ గణాంకాధికారి రావూరి అమరనాథ్, వీఆర్వోలు బాషా, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి

కారంచేడు(మార్టూరు): గ్రామీణ ప్రాంత ప్రజలు రక్తహీనతపై అవగాహనతో మెలగాలని, ఎప్పటికప్పుడు వైద్యుల సూచనలు పాటించాలని డాక్టర్ షాలిని కోరారు. స్వర్ణ పీహెచ్‌సీలో బుధవారం రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వ్యాధి బారినపడినవారు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు.

బాలుడికి స్వల్ప గాయాలు

వి.కొప్పెరపాడు(అద్దంకి), న్యూస్‌టుడే: నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై బుధవారం రోడ్డు దాటుతున్న పదేళ్ల బాలుడు పి.కిరణ్‌ను ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు ఢీకొట్టింది. గాయపడిన బాలుడ్ని స్థానికులు 108లో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉంది.